ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025 | 5 | కర్నూలు

శివప్రియ నగర్‌లో దౌర్జన్యకాండ..!

- స్థలం మాదే అంటూ జెసిబిలతో కూల్చివేతలు - భయాందోళనలో బాధితులు - రక్షణ కల్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగర శివార్లలోని శివప్రియ నగర్‌లో దౌర్జన్యకాండ సాగుతోంది. తాము డబ్బులు పెట్టి కొన్న స్థలాలను ఇప్పుడు కొందరు దౌర్జన్యంగా స్థలం మాదే అంటూ జెసిబిలతో కూల్చివేతలు పాల్పడుతున్నారు. దీంతో బాధితుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. తమకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు...

కర్నూలు నగర శివారులో జొహరాపురం గ్రామ పరిధిలోని 161 సర్వే నంబరులో శివప్రియ నగర్ ఉంది. అందులో 11.27 ఎకరాల పొలాన్ని చిన్న మాదన్నకు ఉండగా 1987లో కేశవ నారాయణ అనే వ్యక్తికి జిపిఎ ఇచ్చారు. 1988 నుంచి ఇప్పటి వరకూ ఆ స్థలాన్ని దాదాపు 350 ప్లాట్లుగా విక్రయించారు. కొన్న వారు షెడ్లు వేసుకుని, ఫెన్సింగ్ వేసుకుని ఉన్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభిస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రస్తుతం 2.5 సెంట్ల స్థలం విలువ రూ.25 లక్షలు ఉంది. అయితే ఆ స్థలం తమదేనని, తమ వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయంటూ చిన్నమాదన్న వారసులు స్థల యజమానులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. ఈ ఏడాది మార్చి 10న జెసిబిలను తెచ్చి షెడ్లను, ఫెన్సింగ్‌లను కూల్చారు. అప్పుడు బాధితులు కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి అక్కడితో వదిలేశారు. తరువాత ఈ నెల 21న మళ్లీ జెసిబిలతో వచ్చి మరిన్ని షెడ్లు, ఫెన్సింగ్‌లు కూల్చేశారు. ఇంటి నిర్మాణానికి కట్టిన పునాదిని కూడా నేలమట్టం చేశారు. తాను ఇప్పటి వరకూ నాలుగు సార్లు సర్వే చేయించి ఫెన్సింగ్ వేసుకుంటే నాలుగు సార్లు పడగొట్టేశారని ఒక ప్లాటు యజమాని జహంగీర్ బాషా తెలిపారు. 2020లో ఫేక్ పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించి దాని ఆధారంగా ఫిబ్రవరి 20న కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోలదాసు బాలస్వామి అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. జెసిబిలతో దౌర్జన్యాలు చేస్తున్నారని, రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ స్థలాలకు, తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్ స్పందించాలి

కర్నూలు నగర శివారులో శివప్రియ నగర్‌లో కూల్చివేతలు దుర్మార్గం. అంత జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు కళ్లు మూసుకుని ఉన్నారు. డబ్బులు పెట్టి కొన్న స్థలాలకే రక్షణ లేకుండా పోయింది. రక్షణ కోసం స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వారి రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రక్షణ కల్పించాలి

మేము ఇక్కడే ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాము. జెసిబితో ఇంటిని కూల్చడానికి వచ్చారు. అడ్డుపడితే నన్ను, కుటుంబ సభ్యులను దుర్భాష లాడారు. ఎప్పుడు వచ్చి కూల్చేస్తారోనని భయభ్రాంతులకు గురవుతున్నాము. మాకు రక్షణ కల్పించాలి.

- శివశంకర్, బాధితుడు.

పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి

మా తల్లి ఇందిర పేరుతో స్థలం ఉంది. మా స్థలంలో సంవత్సరం కిందట షెడ్డు వేసుకున్నాం. షెడ్డు మొత్తాన్ని కూల్చేశారు. రూ.10 లక్షల వరకూ నష్టం వాటిల్లింది. కూల్చివేసిన వారిని వెంటనే రిమాండ్ చేయాలి. మాకు నష్టపరిహారం చెల్లించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. ఇక్కడ పోలీసులను పెట్టాలి.

- మధుబాబు, బాధితుడు.

వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

మున్సిపల్ కార్పొరేషన్ అప్రూవల్‌తోనే 6 నెలల క్రితం ఇంటి నిర్మాణం ప్రారంభించాం. అప్పటి నుంచి శ్రీనివాసులు, ఆంజనేయులు నాయక్, వెంకటరాముడు, కేశవులు అనే నలుగురు మమ్మల్ని బెదిరిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. స్థలం మాదే అంటూ ఈ నెల 21న జెసిబితో పునాదిని కూల్చేశారు. ఎస్సి, ఎస్టి కేసు పెడతామని బెదిరిస్తున్నారు. సంవత్సరాల నుంచి స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నాం. మొదటి సారి కూల్చివేతలు చేసినప్పుడు పోలీసులు ఫిర్యాదు చేస్తే ఐదు మందిపైన కేసు నమోదు చేసి వదిలేశారు. వాళ్లను అరెస్ట్ చేసి ఉంటే మళ్లీ కూల్చివేతలు జరిగేవి కావు. మాకు రూ.15 లక్షల వరకూ నష్టం వచ్చింది. పోలీసులు వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. మాకు నష్టపరిహారం ఇప్పించాలి.

- వై.అర్జున్ రెడ్డి, బాధితుడు.

ప్రయివేటు ప్రాజెక్టులకు కేటాయింపులు

- రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పలు ప్రయివేటు ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. నంద్యాల జిల్లాలోని అవుకులో ఆర్‌విఆర్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 800 మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఆ సంస్థకు కేటాయించడానికి చేసిన అభ్యర్థనను ఆమోదించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కర్నూలు, నంద్యాల జిల్లాలోని డోన్ పశ్చిమ ప్రాంతంలో 300 మెగా వాట్ల విండ్ పవర్ కెపాసిటీలను కేటాయించడం కోసం ప్రభుత్వ ఆదేశాలను సవరించి అనుమతినివ్వాలని రీన్యూ వ్యోమన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనను కేబినెట్ ఆమోదించింది. అదే ప్రాంతంలో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపునకు రీన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనను ఆమోదించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లా గుండు తండ వద్ద గతంలో అనుమతించిన క్రిజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 328 మెగా వాట్ల విండ్ పవర్ కెపాసిటీని ప్రాజెక్టు అమలులో ఆలస్యం కారణంగా అనుమతిని రద్దు చేసింది.

గోరుకల్లు రక్షణ పనులకు నిధులు

నంద్యాల జిల్లా పాణ్యం మండలం, గోరకల్లు గ్రామంలోని గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద శ్రీ నరసింహరాయ సాగర్ ప్రాజెక్ట్ రక్షణ పనులు ఫేజ్-1 కోసం రూ.53 కోట్లకు పరిపాలనా ఆమోదానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

బనగానపల్లెలో బిసి బాలికల హాస్టల్ నిర్మాణానికి స్థలం

బనగానపల్లెలో మార్కెట్ యార్డుకు దక్షిణం కోయిలకుంట్ల రోడ్డుకు వద్ద ఉన్న బిసి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ కమ్ హాస్టల్ నిర్మాణం కోసం యాజమాన్య హక్కులను బదిలీ చేయకుండా, అద్దె ఆధారం లేకుండా 5.97 ఎకరాల భూమి కేటాయింపునకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి
- అర్ధ వార్షిక నేర సమీక్షలో డిఐజి, ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సీరియస్ గా పని చేస్తేనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఉండదని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఐజి మాట్లాడుతూ... జిల్లాల విభజన తర్వాత కర్నూలు రేంజ్‌లో కర్నూలు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు. పాత కక్షలు లేకుండా అందరికి కౌన్సిలింగ్ చేయాలన్నారు. ఎక్కడైనా అల్లర్లు జరగకుండా, ఓపెన్ డ్రింకింగ్ వంటివి లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘాతో విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు అంటనే భద్రత అనే విధంగా పోలీసుస్టేషన్‌లు బాగా పని చేయాలన్నారు. పోలీసుస్టేషన్లలో భాదితులకు న్యాయం జరిగితే పోలీసు ఉన్నతాధికారులను బాధితులు ఆశ్రయించే అవకాశం ఉండదన్నారు. న్యాయం జరగక పోతేనే పోలీసు ఉన్నతాధికారులను భాదితులు ఆశ్రయిస్తారన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా పెంచుకోవాలన్నారు. ఎస్పి మాట్లాడుతూ... పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ లలో సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి గట్టిగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో, పరిధిలలో సిసి కెమెరాలు బాగా పని చేసేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లో పరిధిలలో నేరనివారణకు ముందస్తు జాగ్రత్తల చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పిడి యాక్టులు, బైండోవర్లు, రౌడిషీటర్లకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలను డ్రోన్ కెమెరాలతో ఇంకా బాగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీలు చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో నిందితుల వేలి ముద్రలను సేకరించి చేధించాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో గత ఆరు నెలలుగా చోటు చేసుకున్న నేరాల విశ్లేషణ, దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు తీసుకున్న చర్యలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. గత 6 నెలల కాలంలో నమోదైన క్రైమ్ గణాంకాల విశ్లేషణ జరిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే పనితీరు మునుముందు కొనసాగిస్తూ అందరి సమిష్టి కృషితో బాధితులకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయికి, డ్రగ్స్ కి గుడ్ బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో-మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను కర్నూల్ రేంజ్ డిఐజి, ఎస్పి ఆవిష్కరణ చేశారు. జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు అటువంటి సమాచారంను టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్ లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డిఎస్‌పిలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత , ఎఆర్ డిఎస్ పి భాస్కర్ రావు , సిఐలు , ఎస్ఐలు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

స్థాయి సంఘం ఎన్నికకు 7 నామినేషన్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘ ఎన్నికకు చివరి రోజు గురువారం ఏడుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరగనుంది. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సినియర్ అసిస్టెంట్ జిఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు:

ఇ.నారాయణ రెడ్డి- 28వ వార్డు కార్పొరేటర్ , వై.వెంకటేశ్వర్లు - 34వ వార్డు కార్పొరేటర్ , సి.హెచ్. సాంబశివరావు - 39వ వార్డు కార్పొరేటర్ కురుబ మునెమ్మ - 43వ వార్డు కార్పొరేటర్ , షేక్ అహ్మద్ - 50వ వార్డు కార్పొరేటర్, దండు లక్ష్మికాంత రెడ్డి - 26వ వార్డు కార్పొరేటర్ పి.షాషావలి - 1వ వార్డు కార్పొరేటర్.

నామినేషన్లు దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

ఆదర్శ్ గ్రామయోజన నిధులు అభివృద్ధికే..

కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రధాన మంత్రి ఆదర్శ్‌గ్రామ యోజనపథకం మంజూరు అయ్యే నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలోని బొడ్డువానిపల్లె గ్రామం, ఆదోని మండలంలోని నారనపురం గ్రామ పంచాయతీ, చాగి గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని ఎనిగబాల గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. పనులు పూర్తి చేసిన వాటికి రెండు రోజుల్లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. హొళగుంద మండలం మార్లమాడికి, కర్నూలు మండలం పసుపుల గ్రామ పంచాయతీ లోని నూతనపల్లె, పెద్దకడబూరు మండలం మ్యాకదోన, ఆస్పరి మండలం నగరూర్, ఓర్వకల్లు మండలంలోని ఉప్పలపాడు, మంత్రాలయం మండలంలోని బూదూర్, గూడూరు మండలంలోని గుడిపాడు, గూడూరు మండలంలోని కే.నాగలాపురం గ్రామపంచాయతీ, కురువ నాగలాపురం గ్రామం, నందవరం మండలం మాచపురం గ్రామాలను రెండవ విడత కింద ఎంపిక చేసరన్నారు.ఈ గ్రామాల్లో ప్రతిపాదించిన అభివద్ధి పనులను చేపట్టాలని ఆదేశించారు.. పాఠశాలల్లో, అంగన్వాడి సెంటర్లలో మరమ్మతుల పనులు, తాగునీటికి సంబంధించి ఫిల్టర్‌బెడ్ సమస్యలు, పంచాయతీరాజ్ కి సంబంధించి అప్రోచ్ రోడ్లు, ఆర్‌అండ్‌బి రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర పనులను చేపట్టాలన్నారు .సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, జల వనరుల శాఖ ఎస్ ఈ బాలచంద్రా రెడ్డి, ఐసిడిఎస్ పిడి నిర్మల, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థి ఎన్నికలను నిర్వహిస్తున్న దృశ్యం

'శ్రీ చైతన్య'లో విద్యార్థి ఎన్నికల కోలాహలం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం విద్యార్థుల ఎన్నికల కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్, ఆర్ఐ రామాంజనేయులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.మంజుల మాట్లాడుతూ ఈ ఎన్నికలు విద్యార్థులు క్రమశిక్షణగా మెలగడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుటకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులందరూ అత్యుత్సాహంతో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని చెప్పారు. ఎన్నికలలో పోటీ చేసిన విద్యార్థి నాయకులు ఉత్తమ నాయకున్ని ఎన్నుకోమని విద్యార్థులను అర్థించడంలో ప్రజా స్వామ్య పద్ధతి కొట్టొచ్చినట్లు కనిపించిందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎఒ పరమేశ్వర రెడ్డి, డీన్ రాజేష్, ప్రైమరీ ఇన్‌ఛార్జులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

-ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం కర్నూలు మండలం దిన్నదేవరపాడు గ్రామ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచి మీసాల మాధవ స్వామి, టిడిపి సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షులు బుగ్గ వెంకటేశ్వర్లు పలువురు టిడిపి నాయకులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఏడాది తిరగకముందే అనుకున్న దానికంటే అధికంగా హామీలను నెరవేర్చారన్నారు. త్వరలోనే మిగిలిన పథకాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సమయం పాటించని వైద్యులు

- ఓపిలకు కూడా హాజరు కాని వైనం
- పీజీల పైనే వైద్య భారం
- అసహనంలో బాధిత రోగులు
- ఎట్టకేలకు స్పందించిన సూపరింటెండెంట్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అత్యధిక సీనియర్ వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఓపి రోజు కూడా సమయానికి రావడం లేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాస్పిటల్లో అందుబాటులో ఉండాలి. డ్యూటీకి వచ్చినా వైద్యులు ఓపిలను పట్టించుకోవడం లేదు. అందుకే ఓపి వార్డులో రోగులను త్వరగా చూసి అంతా పీజీల పైనే భారం వేసి మధ్యాహ్నం 1 గంటలకే బయటికి వెళ్ళిపోతున్నారు. కొంతమంది ప్రభుత్వ వైద్యులు బయట క్లినిక్స్, హాస్పిటల్స్ నిర్వహణలో బిజీగా ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి. సర్వజన వైదశాలకు ప్రతి రోజు సుమారు 2 వేలకు పైగా ఓపిలు వస్తుంటాయి. సుదూర ప్రాంతాలు ఇతర జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రోగులు ఎన్నో వ్యయ ప్రయాసలతో ఖర్చుతో కూడుకొని ఇక్కడికి వస్తే వైద్యులు అందుబాటులో ఉండకపోవడం ఓపిలు భారీగా ఉండటం, సరైన వైద్యం అందక వైద్యులు అవగాహన కల్పించకపోవడంతో రోగులు ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దానినితో ప్రైవేట్ వైద్యం కోసం వెళ్లి టెస్టులు, పరీక్షలు, మందుల ఖర్చుల పేరుతో వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రజలందరికి మెరుగైన వైద్యం అందిస్తామని గొప్పలు చెబుకుంటున్నా కొంతమంది వైద్యుల నిర్వాకంతో అపఖ్యాతి వస్తుందన్న వాదనలు ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్నా ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యం అందని ద్రాక్షగా మారుతుందని ప్రజలు ప్రశ్నించు కుంటున్నారు. వీటి మీద ప్రభుత్వ అధికారులు వైద్యశాఖ అధికారులు దృష్టి పెట్టి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మంత్రాలయం నుంచి వచ్చిన ఒకరోగి తన వెంట ముగ్గురి సహాయకులతో కారు తీసుకుని హాస్పిటల్‌కు వచ్చారు. గతంలో చూసిన డాక్టర్ లేకపోవడంతో ఇలా ఎన్ని సార్లు తిరగాలని విసూరుమని వెనుతిరిగి వెళ్లిపోయారు.

ఎట్టకేలకు స్పందించిన సూపరింటెండెంట్ హెచ్‌ఒడిలతో సమీక్ష

హెచ్‌ఒడిలతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు వైద్య కళాశాల సెమినార్ హాల్‌లో వివిధ విభాగాల హెచ్ ఒడిలతో గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఐవిఆర్ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ , ఈ హాస్పటల్, పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి పెంచిన నెల వారి కేసులను వారికి ఇచ్చిన టార్గెట్లను అధిగమించి వాటికి అనుగుణంగా సేవలను ఇంప్రూవ్ చేసినందుకు వైద్యులను అభినందించారు. అదే సమయంలో ఒపి, ఐపి, డిశ్చార్జ్ ఫార్మసీ అన్ని డేటా ఎంట్రీ ప్రాసెస్ ఈ హాస్పిటల్‌లో ఇంప్లిమెంటేషన్, మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పేషంట్స్‌కు అందుబాటులో ఉండి ఆయా విభాగాలలో వైద్యులు , సిబ్బంది సమయపాలన పాటించి పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెచ్‌ఒడిలను ఆదేశించారు. ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లులేని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒపి విభాగాలలో సమయపాలన పాటించాలని లేని యెడల వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండిక్యాజువలిటీకి వచ్చే కేసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కెఎంసి ప్రిన్సిపల్, డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ వైద్యులు సమయపాలనలో ఉండి వారి ఎఫ్ఆర్ఎస్, ఇన్, అవుట్ అటెండెన్స్ కంపల్సరిగా ఉండేటట్లు చూసుకోవా లన్నారు. ఎఫ్ఆర్ఎస్ లేని ఎడల వారిను ఆబ్సెంట్ కిందకి వస్తారన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్, డాక్టర్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానంద్ బాబు, ఆయా విభాగాల హెచ్‌ఒడిలు, వైద్యులు పాల్గొన్నారు.

వసతుల లేమితో చదువు సాగేదెలా..?

-మరుగుదొడ్లు లేవు...మైదానం లేదు -తాగునీటి కోసం తంటాలెన్నో...
- శ్రీ పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల భవనాన్ని తక్షణమే నిర్మించాలి
-పాఠశాలను సందర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని మూడవ వార్డు బండిమెట్ట ప్రాంతంలోని శ్రీ పొట్టి శ్రీరాములు స్కూల్ బిల్డింగును తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పర్యటనలో భాగంగా గురువారం శ్రీ పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్ఎండిషరీఫ్, సీనియర్ నాయకులు డి. పార్వతయ్య, నగర నాయకులు మహబూబ్‌షాలతో కలసి ఎం.రాజశేఖర్ సందర్శించారు. పాఠశాలలో అనేక రకాల సమస్యలను విద్యార్థులు నాయకుల దృష్టికి తీసుకొని వచ్చారు. తాగునీరు, మరుగుదొడ్లు లేవు.. ప్రక్కన ఉన్న స్కూల్లోకి వెళ్లి అక్కడి బాత్ రూమ్స్ వాడుకోవాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మౌలిక వసతులు కూడా పాఠశాలలో లేకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని నాయకుల విమర్శించారు. పాఠశాల భవన నిర్మాణం మూడేళ్లుగా నిలిచిపోయిందని, ఈ కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరం అవుతున్నప్పటికీ ఏమాత్రం ఈ స్కూల్ విద్యార్థులపై దృష్టి పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత ఉందని, మౌలిక వసతుల కొరత ఉంటే ఏ రకంగా ముందుకు సాగుతారని ప్రశ్నించారు. తక్షణమే డిఇఒ, కలెక్టర్ ఈ పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవ మంత్రి టిజి. భరత్ బండి మెట్టలోని పాఠశాలకు నిధులు కేటాయించి పాఠశాల గదుల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదిక పై పూర్తిచేయాలని కోరారు. కనీసం ఆడుకోవడానికి గ్రౌండ్ లేదని, చదువుకోడానికి గదులులేక ఉన్న గదులలో విద్యార్థులను సర్దుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారన్నారు. షేక్షావలి, బాషాభాయ్, రసూల్ అహ్మద్ ,ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

టిడిపి పాలనలో సంక్షేమం అభివృద్ధి

- మండల కన్వీనర్ రామకష్ణారెడ్డి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్ : తెలుగుదేశం ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కోడుమూరు టిడిపి మండల కన్వీనర్ లక్కిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. కోడుమూరు నియోజక వర్గం అభివృద్ధి ఒక విష్ణువర్ధన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడని అన్నారు. టిడిపి నాయకులు రఘుపతి ఆహ్వానం మేరకు కొత్తూరు గ్రామంలో బుధవారం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. టిడిపి కార్యకర్తలు, బూత్ ఇంచార్జీలు, కమలాకర్, పరమేశ్వరయ్య, శ్రీనివాసులు, బాలకృష్ణ, యేసేపు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పి4 సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-పత్తికొండ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా చూడాలని లక్ష్యంతో పి4 సర్వేను ప్రారంభించింది. అందుకు విరుద్ధంగా డివిజన్ కేంద్రమైన పత్తికొండలో ప్రభుత్వ అధికారులు మొక్కుబడిగా పి4సర్వే పై గ్రామ సభలు నిర్వహించి మమ అనిపించారు. గురువారం పత్తికొండ పట్టణంలో గ్రామ సచివాలయం 3లో గ్రామ సర్పంచి కొమ్ముదీపిక అధ్యక్షతన పి4 సర్వేపై గ్రామ సభలో ముఖ్య అతిథులుగా పత్తికొండ ఎంపిడిఒ కవితరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నరసింహులు పాల్గొన్నారు. పి4 సర్వేపై ప్రభుత్వ అధికారులకు ,గ్రామ సచివాలయ సిబ్బందికి తప్ప ప్రజలకు అవగాహన కల్పించడం లేదంటూ పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగారు కుటుంబాల మార్గదర్శకాలు పట్టణ ప్రజలకు అవసరం లేదా అంటూ మండి పడుతున్నారు. పేద ప్రజల కుటుంబాలకు పి4 సర్వే ను అవగాహన కల్పించడంలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలం చెందారని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ కవితరెడ్డిని వివరణ కోరడానికి ఫోన్‌చేయగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పి4 సర్వేపై అవగాహన కల్పించాలని పట్టణ,గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

అంతరహస్య మెందుకో...?

ఆర్‌యు పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో గురువారం వర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవ రావు అధ్యక్షతన జరిగిన మీటింగులో ప్రధానంగా అనేక అంశాలపై చర్చించారు. మీటింగ్ జరుగుతున్న నేపథ్యంలో వర్సిటీ పరిపాలన భవనానికి బయట తాళాలు వేసి ఎవరిని లోపలికి అనుమతించకుండా నిర్వహించడం పట్ల వర్సిటీలో చర్చనీయాంశం అయింది. అత్యంత రహస్యంగా పాలకమండలి సమావేశాన్ని నిర్వహించడం పట్ల కూడా విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నటువంటి వర్సిటీ పాలకమండలి సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరి కొంతమంది సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు కమిటీ నుండి కమ్మలదిన్నె వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న, రాష్ట్ర కౌన్సిలర్ యల్లప్పలు ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మిగనూరు ఆర్అండ్‌బి కార్యాలయంలో డిఇ నాగరాజుకు వారు గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లో పని చేసే చాలా మంది ఉపాధ్యాయులు ఈ రోడ్డ పైన బస్సు, స్కూటీలు, ఆటోలలో ప్రయాణిస్తూ పాఠశాలకు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. రోడ్డు పూర్తిగా గుంతల మయమై అధ్వాన్నంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే ఉపాధ్యాయులు అదుపుతప్పి కింద పడి ప్రమాదాలకు గురి అవుతున్నారని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు రోడ్డుపై ప్రయాణించడంతో వెన్ను నొప్పితో బాధపడుతున్నారన్నారు. కేవలం 12 కిలోమీటర్ల ప్రయాణానికి 45 నిమిషాల సమయం పడుతుందన్నారు. గర్భిణులు, అలాగే సాధారణ ప్రజానీకం, విద్యార్థులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లాలంటే తప్పనిసరిగా ఈ రోడ్డు ద్వారానే వెళ్లాలన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతి పత్రమిచ్చిన వారిలో యుటిఎఫ్ నాయకులు మద్రి రాజు, లక్ష్మన్న, శివకుమార్, చంద్రపాల్, సుధాకర్, శాంతన్న, మల్లారి నాగరాజు, శాంతిరాజు, శంకరయ్య, రమేష్, నరసింహ, వెంకటేష్, ఫయాజ్, పఠాన్, రవి కుమార్ ఉన్నారు.

డిఇకి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్‌నాయకులు

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి: ఐలు

ప్రజాశక్తి- ఆలూరు

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కుమార్ అన్నారు. గురువారం ఆలూరు ఆర్అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఐలు జిల్లాకమిటి సభ్యులు రంగప్ప అధ్యక్షతన న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా న్యాయవాదుల సంఘం ఐలు రాష్ట్ర అధ్యక్షులు కుమార్ పాల్గొని మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలనీ చట్టం సాధించడానికి సంఘం వివిధ రూపలలో పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఆలూరు అల్ఇండియాలాయర్స్ యూనియన్ (ఐలు) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.వీరేష్, ప్రధాన కార్యదర్శిగా షాకీర్, ఉపాధ్యక్షులుగా చాంద్‌బాషా, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా ప్రసాద్ రావు, కమిటీ సభ్యులు రంగప్ప, మల్లేష్, అంజిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా నాయకులు షాంసన్, న్యాయవిద్యార్థులు పాల్గొన్నారు.

ఆలూరు సమావేశంలో పాల్గొన్న ఐలు రాష్ట్ర అధ్యక్షులు కె.కుమార్ తదితరులు

వివాదం పై విచారణ

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ఆర్‌టిఒ ఎజెంట్ కార్యాలయంలో జరిగిన సంఘటనపై , ఆర్‌టిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పై విచారణ నిమిత్తం రాయలసీమ జోన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి ఆదోని ఆర్‌టిఒ కార్యాలయంలో విచారణ చేపట్టారు.వివరాల్లోకి వెళితే ఈనెల 4న ఆర్‌టిఒ ఏజెంటు కార్యాలయం ఉద్యోగి మధ్య నెలకొన్న మాటల యుద్ధం వివాదంగా మారింది. ఈ ఘటనలో ఆదోని కార్యాలయం, జిల్లా యంత్రాంగంపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సదరు జూనియర్ అసిస్టెంట్ మనోహర్ విధులకు సంబంధించి అప్పటి నుండి లాగిన్‌లు లాక్ చేశారని కార్యాలయం అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, డిస్టిక్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శారద కుమారి, కర్నూలు ఆర్‌టిఓ భరద్వాజ్ సమక్షంలో జూనియర్ అసిస్టెంట్ మనోహర్, ఏజెంటు మస్తాన్ వద్ద విధులు నిర్వహిస్తున్న అల్తాఫ్‌ను పిలిపించి ఘటన పై విచారణ చేశారు.జరిగిన ఘటనపై ,విచారణ చేపట్టిన జోనల్ జాయింట్ ట్రాన్సోర్ట్ కమిషనర్ కష్ణ వేణిని వివరణ కోరగా జరిగిన ఘటనపై విచారణ చేపట్టాం. ఇరువురు రాజీ అయ్యారని అన్నారు .ఆర్‌టిఒ కార్యాలయం ఉద్యోగి పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎటువంటి చర్యలు తీసుకుంటారని కోరగా ప్రస్తుతం బదిలీ చేస్తామని ఆమె తెలిపారు.

వివాదంపై విచారణ చేస్తున్న రాలయసీమ జోన్ జాయిట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

ఆరాధనకు తిక్కారెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు రావాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డికి శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ఆహ్వానించారు. గురువారం అమావాస్య తిథి సందర్భంగా స్వామి దర్శనార్థమై శ్రీ మఠం చేరుకున్న ఆయనకు ఆ పార్టీ మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్‌లు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళవారం హారతులు స్వీకరించారు. పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆగష్టు 8 నుండి 14 వరకు శ్రీ మఠంలో జరుగనున్న శ్రీ రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు క్లస్టర్ ఇంచార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బిసి సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, హండే అనుమంత, గనేకంటి రామకృష్ణ, సాతనూరు ఉలిగయ్య తదితరులు ఉన్నారు.

ఆరాధనోత్సవాలకు పి.తిక్కారెడ్డికి ఆహ్వానం పలుకుతున్న శ్రీ సుభుదేంద్ర తీర్థులు

బంగారు కుటుంబం అర్హతపై గ్రామసభలు

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర ప్రభుత్వం బంగారు కుటుంబానికి అర్హత ఉన్న వారిని గ్రామ సభల ద్వారా గుర్తించనున్నట్లు ఎంపిడిఒ జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేట, పొట్లపాడు గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచులు షేకమ్మ, సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ కనెక్షన్, కరెంట్ మీటర్, ఇల్లులేని నిరుపేదలను బంగారు కుటుంబం ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్నవారు ఎవరైనా ఉంటే గ్రామసభల్లో గుర్తిస్తామని తెలిపారు. 7 నెలల నుండి జీతాలు అందలేదని పొట్లపాడు పంచాయతీ కార్మికులు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచి సోమశేఖర్ రెడ్డి స్వతహాగా ఇద్దరు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున వేతనం అందించారు.

శ్రావణమాసోత్సవాలకు ఉరుకుంద క్షేత్రం ముస్తాబు

నేటి నుంచి ప్రారంభం

ప్రజాశక్తి- కౌతాళం

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ లక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబయింది. ఈనెల 25 నుండి ఉత్సవాలు ప్రారంభమై ఆగస్టు 23 వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించడానికి దేవాలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు ఈ ఏడాది 25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేక సౌకర్యాలను ఆయన వివరించారు.

9 వారాలు తొమ్మిది ప్రదిక్షిణలు: శ్రీ లక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి భక్తులు స్వామివారి సన్నిధిలో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రత్యేకంగా 9 వారాలు ప్రదిక్షణాలు చేసేలా సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. చాలామంది భక్తులు స్వామివారి సన్నిధిలో చాలా తక్కువ సమయం దొరికేదని, ఒక బాధ ఉండేది. భక్తుల కోరిక మేరకు ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

శుద్ధ జలాలు:శ్రావణమాస ఉత్సవాలలో భక్తులు తాగునీరు అందదాక ఇబ్బందులు పడేవారు. శుద్ధ జలాలు అందించడానికి కౌతాళం సమీపంలోని ఎస్ అసిస్టెంట్ ద్వారా ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి 1.50 లక్షల లీటర్ల సామర్థం గలసంపును ఏర్పాటు చేశామన్నారు. దేవాలయం సమీపంలోని బావిలో మరమ్మతు చేపట్టి 2.50 లక్షల లీటర్లు నీటిని నిల్వ చేస్తున్నామన్నారు. ప్రతిరోజు 50 వేల లీటర్ల సరఫరా చేసే సామర్థ్యం గల వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు.

నిత్య అన్నదానం: పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం రెండు పూటలా అన్న ప్రసాదం అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. పుణ్యక్షేత్రం పరిధిలో మూడు ప్రాంతాల్లో భక్తులకు ఈ సేవలు అందించడానికి ఏర్పాట్లను చేశారు.

వసతి సౌకర్యాలు: పుణ్యక్షేత్రంలోని వసతి గృహాలను ఆధునికరించి యాత్రికులకు వసతి గృహాలను అందిస్తున్నామన్నారు.165 సాదరణ రూములతోపాటు 32 ఎసి రూములు ఉన్నాయన్నారు. వీటితో పాటు ఆలయ ప్రాంగణంలో 9 భారీ షెడ్లు, వెయ్యి మందికి సరి పడే రెండు షెడ్లను నూతనంగా నిర్మించారు. 4 ఐమాక్స్ విద్యుత్ స్తంభాల ద్వారా వెలుగులు వికసించేలా అమర్చారు.

శ్రావణ మాస ఉత్సవాలకు సిద్ధమైన ఉరుకుంద క్షేత్రం

సాంస్కృతిక కార్యక్రమాలు: ఉత్సవాలలో ప్రత్యేక రోజుల్లో రాత్రి సమయంలో భక్తుల కోసం ప్రత్యేకంగా సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వామిసన్నిధిలో భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలను కిలకించడానికి ఏర్పాట్లను చేశారు.

ప్రత్యేక దర్శనాలు: వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ప్రత్యేక దర్శనాలను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనాలతో పాటు, రూ.500 చెల్లిస్తే స్లాబ్ దర్శనం, ఉత్తర ద్వారం లాంచ్ ఏర్పాటు చేశారు. రూ.1000 చెల్లిస్తే ప్రత్యేక సమయంలో అంతరాలయం దర్శనం ఉంటుందన్నారు.

ప్రత్యేక నిఘా నేత్రాలు: అత్యంత సాంకేతిక పరిజ్ఞానం గల 54 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పుణ్యక్షేత్రం పరిసరాలలో ఆడియో , వీడియో రికార్డింగ్ అయ్యేలా అమర్చారు. వీటి ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించవచ్చని తెలిపారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగ సమస్యల పరిస్కారం కోసం ఎస్.ఎఫ్.ఐ నిరంతరం పోరాడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ జనరల్ బాడీ సమావేశంలో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సంస్కరణ పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రభుత్వం బలహీనపరిచే ఆలోచన విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం విద్యార్థులు సమిష్టి ఉద్యమానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.ఆదోని పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఆదోని పట్టణంలో ఎస్ఎఫ్ఐ బలోపేతానికి సహకరించాలని వారు కోరారు. 15మందితో ఆదోని పట్టణ నూతన పట్టణ కమిటీ ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా చరణ్ తేజ, పట్టణ కార్యదర్శి శశిధర్, పట్టణ ఉపాధ్యక్షులుగా సంజయ్, ఉత్తేజ్, పట్టణ సహాయ కార్యదర్శులుగా హేమంత్, ఉదయ్, కమిటీ సభ్యులుగా 10 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించేంతవరకు అదే విధంగా, ఆదోని మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని స్థానిక విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు శివ, నరసింహ, సంజయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎస్ఎఫ్ఐ నూతన కమిటీతో జిల్లా కార్యదర్శి రంగప్ప , తదితరులు

విద్యార్థులకు అదనంగా బస్సు నడపాలి

యువజన, విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండకు వివిధ గ్రామాల నుండి విద్యార్థులు వస్తున్నారని అధిక సంఖ్యలో విద్యార్థులు వస్తుండడంతో మరో విద్యార్థి బస్సు నడపాలని డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ సంఘాల మండల కార్యదర్శిలు శ్రీనివాసులు, భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి విద్యను అభ్యసించడానికి గద్దెరాళ్ల, పల్లెదొడ్డి, ఓబులాపురం, మాదాపురం, జిల్లబుడకల గ్రామాల నుండి 200 పైగా విద్యార్థులు వస్తున్న నేపథ్యంలో బస్సులో తీవ్ర అసౌకర్యంగా ఉండడం అదేవిధంగా కొంతమంది విద్యార్థులు ఊపిరాడక అస్వస్థతకు గురైన సంఘటన జరిగిందన్నారు. మరొక విద్యార్థి బస్సు వేయాలని సంబంధిత ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్‌బాష, మాదన్న, రవి, రామాంజిని, శివ, రెయిన్బో, భారతి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కార్యాలయం ఎదుట విద్యార్థులతో ధర్నా

నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాలి : ఎఒ సరిత

ప్రజాశక్తి - నందవరం

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులను విక్రయించాలని ఏవో సరిత దుకాణాల యజమానులకు తెలిపారు. ఆమె గురువారం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కోరమండల్ నందవరం, న్యూనవీన్ ట్రేడర్స్, శివ సాయి ట్రేడర్ నాగలదీన్నె, అఖిల్ ఎంటర్ప్రైజెస్ ఇబ్రహీంపురం దుకాణాలను, గోడౌన్‌లో ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. యూరియా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మాలని తెలిపారు. మందులను కొనుగోలు చేసిన రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. యూరియ స్టాక్ నిల్వలను, అమ్మకాలను పరిశీలించారు. ఓ ఫారం ఇంక్లూషన్స్ లేనందు వల్ల నందవరం కోరమాండల్ రూ.1,92,000 విలువ గల న్యూట్రియెంట్స్ ఎరువులను నాగలాదిన్నె శివ కిరణ్ ట్రేడర్‌లో రూ.2,30,000 విలువ గల కాంప్లెక్స్ ఎరువులను తాత్కాలికంగా అమ్మకాలను నిలిపివేసినట్లు ఆమె తెలిపారు.

బీసీ హాస్టల్ డ్రెయినేజీ పనులకు..రూ. 5లక్షలు మంజూరు : ఇఇ

ప్రజాశక్తి - మద్దికేర

బీసీ హాస్టల్ అండ్ గ్రౌండ్ డ్రెయినేజీ కాల్వ పనులకు రూ. 5లక్షలు మంజూరైనట్లు బీసీ సంక్షేమ శాఖ ఇఇ మురళీధర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేరలో డ్రెయినేజీ కాల్వ పనులకు ఆయన గురువారం స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. గతంలో బీసీ హాస్టల్‌లో వస్తున్న మురుగు నీరు రోడ్డు పక్కన ఉన్న బావిలోకి వదిలే వారని, ప్రస్తుతం బావిని పూడ్చడంతో హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. హాస్టల్ నుంచి మురుగునీరు మళ్లింపు పనులకు ఎంపీ నిధుల నుండి రూ. 5 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలోనే డ్రైనేజీ పనులు ప్రారంభించి విద్యార్థులకు మురుగునీరు సమస్య లేకుండా చేస్తామని చెప్పారు. హాస్టల్ విద్యార్థుల కోసం చేస్తున్న అభివద్ధి పనులకు గ్రామస్తులు నాయకులు సహకరించాలని కోరారు. ఆయన వెంట డిఇ వీరయ్య, ఎఇ మహమ్మద్, బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, తాలూకా తెలుగు యువత నాయకులు చంద్రశేఖర్ గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

ఉపాధి రంగ అభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి - ఆదోని

పెట్టుబడులు ఆకర్షిస్తూ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉద్యోగాలు కల్పన దిశగా ఉపాధి రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ టిడిపి సీనియర్ నాయకుడు సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోని పట్టణంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్థానిక టిడిపి నాయకులు వీరసేన, పీర, ఆధ్వర్యంలో సపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇల్లులు తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్ , బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున , సోమశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి వున్నారు.

సిఐ రామాంజులుకు ఎస్‌పి ప్రశంస

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామాంజులు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. గురువారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో చేపట్టిన సమీక్ష సమావేశం అనంతరం ఎస్‌పి ద్వారా ప్రశంసా పత్రం స్వీకరించారు. ఈ నెల 18న మాధవరం గ్రామానికి చెందిన రచ్చుమర్రి కొప్పురప్ప (45), అనే వ్యక్తి చనిపోవాలని తుంగభద్ర నదిలో దూకారని సమాచారం తెలుసుకున్న సిఐ రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆయన్ను రక్షించి ప్రాణాలు కాపాడడమే కాక స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు. ట్రాఫిక్‌కు నియంత్రణలో చేస్తున్న కృషిని అభినందిస్తూ ప్రశంసా పత్రం ఇచ్చారని సిఐ రామాంజులు తెలిపారు.

గంజిహళ్లిలో చిరుత సంచారం

- దున్నపోతును చంపి తిన్న చిరుత

- పాదముద్రలు గుర్తించామంటున్న రైతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో రెండు మూడు రోజులుగా చిరుతపులి సంచరిస్తుందన్న భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. రెండు రోజుల కిందట గంజిహళ్లి నుంచి ఎన్నెకండ్ల గ్రామానికి వెళ్లే దారిలో పొలంలో గ్రామానికి చెందిన ఒక రైతు రెండు బర్రెలు, రెండు దూడలను కట్టివేయగా మంగళవారం రాత్రి చిరుత పులి దాడి చేసి దున్నపోతును చాలా దూరం వరకు లాక్కొని వెళ్లి సమీపంలో చిన్నపాటి కొండలా ఉండే రాళ్లలోకి లాక్కొని వెళ్లి చంపి తల, వెనుక భాగంలో పీక్కుతిన్నట్లు రైతులు గుర్తించారు. పొలం వద్ద నుంచి దున్నపోతు కళేబరం పడి ఉన్న దగ్గర వరకు పాదముద్రలను రైతులు గుర్తించారు. అవి ఖచ్చితంగా చిరుత పులివేనని వారు అంటున్నారు. అంతేకాకుండా ఆ పాదముద్రలు కొండ నుంచి గంజిహళ్లి గ్రామ సమీపంలోకి వచ్చి పక్కనే ఉన్న వంక ముళ్ళ పో దల్లోకి వెళ్ళినట్లుగా ఉండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. పంటల సమయం కావడంతో బయటికి వెళ్తే ఏం జరుగుతుందో అని పొలం పనులకు వెళ్లడానికి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పులిని బంధించి రక్షణ కల్పించాలి ....

వీలైనంత త్వరగా గ్రామ శివారులో సంచరిస్తున్న పులిని బంధించి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని సర్పంచి తోలు లక్ష్మి కుమారుడు తోలు రాముడు, వేణు, గ్రామస్తులు కోరుతున్నారు. రెండు మూడు రోజులుగా గ్రామ సమీపంలో చిరుతపులి చంపిన దున్నపోతు కళేబరాన్ని, గ్రామ సమీపంలోకి సంచరించిన పాదముద్రలను గుర్తించిన విషయాన్ని ఆదోని ఫారెస్ట్ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితం బిల్లేకల్ గ్రామం నుంచి చిరుత బయలుదేరి సమీప గ్రామాల్లో సంచరిస్తుందని గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అటవీ అధికారులతో పాటు పశు వైద్యులు శుక్రవారం గ్రామానికివచ్చిపోస్టుమార్టం నిర్వహించనున్నారు.

ఆధునిక ప్రజాకవి గుర్రం జాషువా

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

పేద వర్గాల దళితుల సామాన్యుల జీవితాలను పద్య రూపంలో వివరించి తెలుగు ప్రజల హృదయాలను చూరగొన్న కవి గుర్రం జాషువా అని పలువురు వక్తలు అన్నారు. గురువారం రాత్రి టిజివి కళాక్షేత్రంలో గుర్రం జాషువా 55వ వర్ధంతి సభ నిర్వహించారు. గుర్రం జాషువా చిత్రపటానికి పుష్పమాలతో పలువురు కళాకారులు, కవులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభకు కళారత్న పత్తి ఓబులయ్య సభకు అధ్యక్షత వహించారు. అనంతరం కథా సమయం కవి ఇనాయతుల్లా సభను ప్రారంభిస్తూ 20వ శతాబ్దంలో జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న కవి అని అన్నారు. కానీ చివరకు ఆయనను వ్యతిరేకించిన కవులే గండె పెండేరం తొడిగి సత్కరించారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి రాజు సుకవి స్మశాన వాటిక వంటి కవితలు ప్రజల నాలుకలపై నాట్యం చేసాయన్నారు. పద్మభూషణ్ అవార్డుతో పాటు ఎమ్మెల్సీ పదవి నుంచి ప్రభుత్వం ఆయనను గౌరవించిందన్నారు. గుర్రం జాషువాపై రంగస్థలం కళాకారులు మహమ్మద్‌మియా, కెవి.రమణ, పి దస్తగిరి, సిద్దయ్య, శామ్యూల్ పద్యాలను పాడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.రాజారత్నం, క్రిస్టఫర్, చంద్రకంటిమద్దయ్య, గాండ్ల లక్ష్మన్న, బాల వెంకటేశ్వర్లు, సిద్దయ్య తదితరులు ప్రసంగించారు.

డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్

ప్రజాశక్తి - నందవరం

డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ డీకేఎస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ కోరారు. జిల్లాలో అర్హులైన కళాకారులకు డప్పు, గజ్జలు,డ్రెస్ ఇవ్వాలని అన్నారు. పెన్షన్ ఆన్లైన్ నమోదు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన నందవరంలో ఏపీ డీకేఎస్ మండల కార్యదర్శి చిన్న రాజు,కెవిపిఎస్ ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మన్న అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడరు. పెన్షన్ ఆన్లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, పెన్షన్ దరఖాస్తు వయసును 45 సంవత్సరాలకు తగ్గించాలి, పెన్షన్‌ను 7 వేలకు పెంచాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. బస్సు, రైలు ప్రయాణాల్లో 25 శాతం రాయితీ కల్పించాలని, మూడు సెంట్లు స్థలమును ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని, రెండు ఎకరాల వ్యవసాయ సాగు భూమిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డికెఎస్ మండల కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నందవరం మండల నూతన కమిటీని డప్పు కళాకారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా నందవరం జయరాజు, పెద్దకొత్తిలి చిన్నరాజు, ఉపాధ్యక్షులు నదికైరవాడి ప్రసాద్, నాగలదిన్నె తిమ్మప్ప, నందవరం దేవరాజు, ఏ.నరసన్న, సహాయ కార్యదర్శులు మూగతి బజారి, నది కైరవాడి దేవదాసు,మాచాపురం పెద్దయ్య, నాగలదిన్నె బతుకప్ప ,కోశాధికారిగా పూలచింత పి.నరసింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు రాజా రమేష్, కెవిపిఎస్ నాయకులు మనోహర్, వీరితోపాటు వివిధ గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

- ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్

IN THE COURT OF II ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
M.V.O.P. No. 125/2014
Boya Doddamma & others. ...Petitioners
Vs
V. Ramudu & Another. ...Respondents
NOTICE TO THE RESPONDENT No.3
To
K. Veeranna S/o K. Ramanna,
Driver of Tractor bearing No.AP 04 L 8965,
Trolley No.AP 04 8966, R/o Baichigeri Village,
Adoni Mandal.
Whereas the above named petitioners have instituted the petition under Sec.166(c) M.V Act claiming compensation for the death of Boya Jelli Doddaiah. You are hereby summoned to appear before this court in person or through and advocate on **07.08.2025 at 10.30 AM** to answer the said claim and you are hereby directed to produce on that day all the documents upon which you intend to relay in support of your defence.
Take notice that in default of your appearance on the day before mentioned the petition will be heard and determined in your absence.
(By Court Order)
K.Ramanjaneyulu,
Advocate,
Adoni 518 301.
Cell No.9866337150

ప్రకటన
IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE : KURNOOL
T.R.O.P.NO.47/2024
1) Vadde Timmaiah and onther. ...Petitioners
2) Vadde Someswaraiah & 5 Otthers. ...Respondents
NOTICE TO RESPONDENT NO.3
R3: Katike Ashraf S/o Katike Moiddinsaheb Aged 40 Years. Muslim, R/o D.No.49/50A/ 629, Sri Ram Nagar, B.Camp. Kurnool City.
పై నెంబరు అర్జీ నందు అర్జీదార్లు O.S.No.776/2023 దావాను Prl.Junior Civil Judge Kurnool నుండి Withdraw చేయవిషయమై కొరుతూ. దానిని III Addl Junior Civil Juege. Kurnool ట్రాన్స్‌పరు చేస్తూ III Addl Junior Civil Judge. Kurnool వారి కోర్టు నందు O.S.No.879/2022 దావాతో పాటు విచారించులాగను, ఉత్తర్వులు కోరుతూ పై అర్జీని దాఖలు చేసియుంటున్నాడు.
ఇందు విషయమైన నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల 4-08-2025వ తేదిన ఉదయము 10.30 గంలటకు హాజరై తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షమున విచారించి తీర్మానించబడను అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
యం.డి.వి.జోగయ్యశర్మ,
అర్జీదారుపరము వకీలు,
కర్నూలు.

శానిటేషన్ అధికారులమొండి వైఖరి మానుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ప్రభుత్వం ఆదేశాలనుసారం కమిషనర్ ఒత్తిడి వల్ల ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల మాదిరిగా రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తులపై ఒకేసారి రూ 7వేలు, 8 వేల దాకా ముక్కు పిండి డబ్బులను వసూలు చేస్తున్నారన్నారని తక్షణమే మానుకోవాలని సిఐటియు నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం (సిఐటియు) నగర కార్యదర్శి ,ఎస్ఎండి.షరీఫ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదని గత ప్రభుత్వం వసూలు చేయని ట్రేడ్ లైసెన్స్ నిధులను ఇప్పుడు కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఏరకంగా వసూలు చేస్తారని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చిన్న వ్యాపారస్తులపై కూటమి ప్రభుత్వం ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో భారాలను ఎలా వేస్తుందని ప్రశ్నించారు. కనీసం సమయం కూడా ఇవ్వకుండా ఇప్పుడే కట్టండి లేకపోతే మీ అంగట్లో ఉన్న సామాన్లను మా ట్రాక్టర్‌లో వేసుకొని పోతామని శానిటేషన్ అధికారి బెదిరించడం సమంజసం కాదన్నారు. మరీ నీచాతి నీచంగా వడ్డీ వ్యాపారులగా బెదిరించడం సరైంది కాదన్నారు. కమిషనర్ తక్షణమే పునరాలోచించుకోవాలని అన్నారు. సమయం ఇవ్వని పక్షంలో రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘంగా నగరంలో ఉండే వ్యాపారస్తులందరినీ సమీకరించి ప్రభుత్వం పైన ఆందోళన చేయాల్సి వస్తుందని వస్తుందని హెచ్చరించారు.

రైతులు ఆందోళన చెందొద్దు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కావలసినంత యూరియా అందుబాటులో ఉందని, యూరియా విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు.. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఖరీఫ్ సాధారణ వర్షపాతం 401.1 మిల్లీలీటర్లు కాగా ఈ రోజు వరకు 141.3 మిలీమీటర్ల వర్షపాతం నమోదైనదన్నారు. ఖరీఫ్ – 2025 పంటకాలం యొక్క సాధారణ విస్తీర్ణం 4,22,540 హెక్టార్లన్నారు. జిల్లాలో పత్తి , వేరుశనగ, కంది, మొక్క జొన్న, వరి, మినుము, ఉల్లి, మిరప మొదలైన ప్రధాన పంటలు సాగు చేస్తున్నారన్నారు.. 219875 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని తెలిపారు. ఇందులో ప్రధానంగా పత్తి పంట 163792 హెక్టార్లలో సాగు చేశారన్నారు. జిల్లాలో 1930 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతలో ఉందన్నారు. ఇందులో ఎపి మార్క్ ఫెడ్ వద్ద 491.4 మెట్రిక్ టన్నులు , 399.67 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల వద్ద, 984 మెట్రిక్ టన్నులు రిటైలర్స్ దగ్గర, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీ దగ్గర 54.535 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విసి వెంకటబసవరావు

రాయలసీమ వర్సిటీలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

రాయలసీమ యూనివర్సిటీలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందేందుకు తగు వ్యాయామం తప్పనిసరిగా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. విజయ్ కుమార్ నాయుడు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సివి కష్ణారెడ్డి మెడికవర్‌ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి డాక్టర్ సునీల్ కుమార్ యాదవ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ చిరునామా గుర్తింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదిలో ఆత్మహత్య చేసుకున్న మహిళ చిరునామాను గుర్తించినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తించి కేసు నమోదు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయంపై బెంగళూరు నుండి ఆమె కుమారుడు రాఘవేంద్ర ఇతర బంధువులు గురువారం మంత్రాలయం రాగా ఆమె పేరు మంగళమ్మ(65), భర్త పేరు చంద్రప్ప కాగా 2 నెలల్లో భర్త, చెల్లెలు మృతి చెందగా మనస్తాపం చెంది ఈ నెల 22న అదృశ్యమైందని, 23న బెంగళూరులోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 24న తుంగభద్ర నదిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోష్టు మార్టం అనంతరం ఆమె మృతదేహం అప్పగించినట్లు తెలిపారు.

మార్గదర్శకులను త్వరితగతిన అన్వేషించాలి

నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్ (పి4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పునః పరిశీలించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మార్గదర్శకులను కూడా త్వరితగతిన అన్వేషించాలని కమిషనర్ సూచించారు. గురువారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పి4 పథకం కింద 10,600 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఈ నెలాఖరులోగా వారి అర్హతలను మరోమారు పక్కాగా పరిశీలించాలని సూచించారు. 629 మంది మార్గదర్శకులను ఇప్పటికే ఎంపిక చేశామని, వారికి 3,709 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామన్నారు. మిగిలిన బంగారు కుటుంబాలను ఆగస్టు 15 లోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకులను అన్వేషించాలని తెలిపారు. సచివాలయంలో ఉన్న ప్రతి కార్యదర్శి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదేవిధంగా ఆస్తి పన్ను, కొళాయి, ట్రేడ్ లైసెన్స్ రుసుముల వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివికృష్ణ, సూపరింటెండెంట్ మంజూర్ బాష, స్పెషల్ ఆఫీసర్ సుహైల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ, వేదికపై అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ

తల్లికి వందనంపై ఆందోళన వద్దు

-త్వరలోనే మిగిలిన సొమ్ము జమ

-ఐటిడిపి కర్నూల్ జిల్లా అధ్యక్షులు గట్టుతిలక్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తల్లికి వందనం పథకం గురించి రకరకాల పుకార్లు వ్యాపిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే మిగిలిన సొమ్ము జమ అవుతుందని ఐటిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ అన్నారు. టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు,కళాశాలల్లో రాష్ట్రంలో 9,10 తరగతులు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నారు. తల్లికి వందనం పథకంలో వీరికి సంబంధించి కొంత వాటాను కేంద్రం భరిస్తుందన్నారు. ఆ సొమ్ము బ్యాంక్ లింకేజి అయిన విద్యార్థులు, తల్లి దండ్రుల అకౌంట్‌లో మరో 20రోజుల్లో జమఅవుతుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వారికి ఆర్థిక వెసలుబాటు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ కేటగిరీలోని విద్యార్థులకు తమ వాటా నిధులు రూ.382.66 కోట్లు జమ చేసిందన్నారు. ఈ కారణంగా 9,10 తరగతులు చదివే ఎస్‌సి డే-స్కాలర్ విద్యార్థులకు సంబంధించి వారి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.10,900, హాస్టల్ విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు రూ.8,800 చొప్పున జమ చేశారన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు రూ.5,200, నుండి రూ.10,972, వరకు నేరుగా విద్యార్థుల సొంత బ్యాంకు ఖాతాలకు జమ చేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ప్రకటించిన విధంగా మిగిలిన సొమ్ము కేంద్ర ప్రభుత్వం రాబోయే 20 రోజుల్లోపు తల్లులు,విద్యార్థుల ఆధార్-లింక్డ్ బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమచేస్తుందన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐటిడిపి కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ తెలిపారు.

రైతులకు నష్టం చేస్తున్న గాలిమరల కంపెనీలు

- రైతును సంప్రదించకుండా పొలంలోనే కాలువ తవ్వారు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో ఫ్యాన్లు కంపెనీ వారు రైతులు అనుమతులు లేకుండా సాగుబడి ఉన్న పొలాలను కూడా పనికి రాకుండా చేస్తున్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా పంట పొలాలలో ఫ్యాన్ యజమానులకు సౌకర్యార్థముగా కాలువలు తీసుకుని రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నేమకల్లు గ్రామానికి చెందిన తలారి నెట్టికల్లు తన మనోవేదనను వెలిబుచ్చారు. రైతు నెట్టికల్లు తాసిల్దార్ ఇజాజ్ అహ్మద్ కు మరియు స్థానిక పోలీస్ స్టేషన్లో తనకు జరిగిన నష్టంపై వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్ కార్యాలయం దగ్గర ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేను నేమకల్లు గ్రామానికి చెందిన రైతుని నాకు 392-ఏ సర్వేనెంబర్ లో రెండు ఎకరాలు పొలం ఉంది. ఎలాంటి అనుమతి లేకుండా కాలువ తీయడంతో పంట సాగు చేసుకోవడానికి కూడా వీలు లేకుండా చేశారన్నారు. నాకు ఉన్న రెండు ఎకరాలలో పెట్టుబడి పెట్టుకోవడానికి ఆర్థిక స్తోమత లేక గత సంవత్సరం పంట సాగు చేసుకోలేకపోయామని, బీడు భూమిగా ఉండడంతో అదే అదునుగా భావించిన చైతన్య ఫ్యాన్లు కంపెనీ వారు మా దగ్గర ఎలాంటి అనుమతి లేకుండా వారి సౌకర్యార్థం నా పొలంలో వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ తీశారని, ఇలా ఎందుకు తీసారని అడిగితే వారు నీకు ఇష్టమైన వారితో చెప్పుకోమన్నారని తెలిపారు. ఇలా భయపెట్టడం ఎంతవరకు సమంజసమని తాసిల్దార్‌కు తెలిపారు. పొలంలో కాలువ తీసిన వారితో మాట్లాడి వారు నష్టం కట్టించలేని పక్షంలో ఆపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

పొలం హద్దుల విషయంలో ఘర్షణ

- ఒకరికి తీవ్ర రక్తగాయాలు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని మారందొడ్డిలో పొలం హద్దుల విషయంలో మాజీ సర్పంచి రుక్మానంద, ఎరువుల వెంకటేష్ మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకొంది. వీరిద్దరి పొలాలు పక్క పక్కనే ఉన్నాయి. వారిద్దరి పొలాల మధ్య రోడ్డు రావడంతో వెంకటేష్‌కు చెందిన ఎనిమిది సెంట్లు భూమి రుక్మానందదిగా పొలం వైపు ఉండి పోయింది. అయితే వెంకటేష్ భూమి ఇటు వైపు సెంటు కూడా లేదంటూ గత ఐదారు ఏళ్లగా మనస్పర్థలు చోటు చేసుకున్నాయన్నారు. గురువారం గ్రామ సర్వేయర్ వీర లక్ష్మి భూ సర్వే చేసే పనిలో ఉండగా ఇందు విషయంలో ఇరువురు మధ్య మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకొన్నారు. ఇంతలో ఇరువురు కుమారులు కూడా ఘర్షణలోకి వెళ్లగా వెంకటేష్ కుమారుడి తలకు తీవ్ర రక్తగాయం అయ్యింది. ఇంతలోనే ఎస్ఐ పరమేష్ నాయక్ ఘర్షణ విషయమై సమాచారం అందుకొని గ్రామానికి చేరుకున్నారు. ఇరువురి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ

నలుగురికి రూ. 265,750

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కోడుమూరు నియోజకవర్గ పరిధిలో కోడుమూరు మండలం, వర్కూగ్రామానికి చెందిన మంగలి రఘునాథ్‌కు రూ.70000, కర్నూలు మండలం సూది రెడ్డి పల్లె గ్రామానికి చెందిన బళ్లారి వెంకటేశ్వర్లుకు రూ.70000, దిన్నెదేవరపాడుకు చెందిన కుమ్మరి పద్మావతికి రూ.68,769, కర్నూలు నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన మాద రాజేష్ కుమార్తె మదనాగయోగ్య శ్రీ వైష్ణవికి రూ. 56,981 చొప్పున మొత్తం రూ.265, 750 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను విడివిడిగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, టిడిపి సీనియర్ నాయకులు, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు. బంగారు కుటుంబాల అర్హతలను పునః పరిశీలించాలి.

ఎంబిబిఎస్ పూర్తి అభినందనీయం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తమ కూతురు డాక్టర్ సూరి నమీర ఖాతూన్ ఫిలిప్పీన్స్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేయడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆమె తల్లిదండ్రులు షేక్ సఫియాఖాథున్, ఇర్షాద్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఫిలిప్పీన్స్ దేశంలోని బనిలాడ్, మాండయూ సిటీలోని గుల్లాస్ కాలేజ్ ఆఫ్‌మెడిసిన్‌లో తమ కూతురు ఎంబిబిఎస్ పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 23న కళాశాలలో నిర్వహించిన 45వ కమెన్స్‌మెంట్ ఎక్సర్‌సైజెస్ కార్యక్రమం సందర్భంగా వైద్య పట్టాను అందజేశారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫిలిప్పీన్స్ ఇండియన్ అంబాసిడర్ హర్ష కుమార్ జైన్ హాజరయ్యారని అన్నారు. ఆయన చేతుల మీదుగా పట్టాను తీసుకోవడం తమకేంతో గర్వకారణంగా ఉందన్నారు. తన కూతురితో పాటు బూరుగుపల్లి లక్ష్మీ కళ్యాణి ఉప్పులూరి రాకేష్ ,విల్సన్ కూడా పట్టాలను అందుకున్నారన్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - ఆదోని

దాడుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం నాటు సారాను ధ్వంసం చేశామని ఆదోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. గురువారం పట్టణ శివారులో రోడ్డుపై పారబోసి రోలర్‌తో తొక్కించి నేలపాలు చేశారు. ఈ సందర్భంగా సిఐ సైదుల్ మాట్లాడారు. ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 94 కేసులలో పట్టుబడిన 2055 లీటర్లు కర్ణాటక మద్యాన్ని కర్నూల్ ఎఇఎస్ రామకష్ణ రెడ్డి పర్యవేక్షణలో ధ్వంసం చేశామన్నారు. కర్ణాటక మద్యం, నాటుసారా మొత్తం విలువ రూ.12 లక్షలు ఉంటుందన్నారు. 17 కేసులలో స్వాధీనం చేసుకున్న 177 లీటర్లు నాటు సారాను ధ్వంసం చేశామని వివరించారు

తుంగభద్రనది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శవాంజల్

నది ప్రవాహాన్ని ఎస్ఐ పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

స్థానిక తుంగభద్ర నది ప్రవాహాన్ని ఎస్ఐ శివాంజల్ గురువారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి నీటి ఉధృతిని పరిశీలించారు. తుంగభద్ర డ్యామ్ నుండి ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తుందని నదిలోకి భక్తులను అనుమతించరాదని తమ సిబ్బందికి, శ్రీ మఠం సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉన్న మైకుల ద్వారా భక్తులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు శ్రీ మఠం సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడున్న కాంగ్రెస్ నాయకులు

బెల్ట్ షాపులను అరికట్టాలి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో బెల్ట్ షాపులను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు దిలీప్, సాయినాథ్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మద్యం కావాలని ఫోన్ కొడితే డోర్ డెలివరీ చేస్తున్నారని తెలిపారు. బెల్టు షాపు కనపడితే తాట తీస్తామని సిఎం చెబుతున్నా.. అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. పట్టణంలో బెల్టు దుకాణాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవినీతిపై, అక్రమాలపై ఎమ్మెల్యే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్పా చిత్తశుద్ధి కనపడటం లేదన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి రాష్ట్ర నాయకులు శ్రీనాథ్ పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి కౌతాళం

శ్రీ లక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ అమ్మవారికి పట్టు వస్త్రాలను డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని పట్టు వస్త్రాలను(చీర) సమర్పించారు. గురువారం అమావాస్య రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు, రామకృష్ణారెడ్డి, తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్, టిడిపి నాయకులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు రాకేష్ రెడ్డి వెంకటపతి రాజు, చిరంజీవి, అయ్యప్ప మహదేవ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి,

అగ్రికల్చర్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోసిగి

ముక్తార్ అనే వ్యక్తి ప్రసిద్ధ బయోటెక్ కంపెనీలో తుంగభద్ర, మాధవరం, కోసిగి మార్కెట్లలో సేల్స్ ఆఫీసర్ గా పని చేస్తూ ఈఏడాది జూన్ 13న ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కు భార్య, ఒక కూతురు ఉన్నారు. కోసిగి, తుంగభద్ర, మాధవరం మార్కెట్లో ఉన్న పెస్టిసైడ్ డీలర్స్ , అగ్రికల్చర్ ఎంప్లాయిస్ మంచి వ్యక్తిని కోల్పోయామని ఆయన ఆత్మ శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ముక్తార్ కు ఒక చిన్న పాప ఉందని డీలర్స్ , సాటి ఉద్యోగులు గుర్తించి ఎవరికి తోచినంత వారు డబ్బులు కలుపుకొని గురువారం రూ. 42,100 ఆర్థిక సాయం చిన్న పాప భవిష్యత్తు కోసం ఉపయోగపడుతుందని ముక్తర్ భార్యకు డబ్బులు అందించారు. అగ్రికల్చర్ యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ ముక్తార్ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చిన పెస్టిసైడ్ డీలర్లకు, సాటి ఉద్యోగస్తులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో యూనియన్ సభ్యులు గానే పెస్టిసైడ్ డీలర్లు, ఎంప్లాయ్ లకు ఎటువంటి సమస్య వచ్చిన ఎంతో తోచినంత ఆర్థికం సాయం చేయడానికి ఇలాగే ముందుకు రావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మూకరెడ్డి, నాగరాజు, పురుషోత్తం, విజయ్ కుమార్, హుస్సేని, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి-ఆలూరు

కర్నూలు జిల్లా సిపిఐ 24వ జిల్లా మహాసభలు కర్నూలు పట్టణంలో ఆగస్టు 9,10,11తేదీన జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆలూరు ఆర్అండ్ బి గెస్ట్ హౌస్‌లో మహాసభల పోస్టర్‌లను విడుదల చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ భారతదేశంలో శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని, దేశంలో అణగారిన పీడిత కార్మిక కర్షక ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటూ వారి సమస్యలపై అలుపెరిగిన ఉద్యమాలు నిర్వహించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీయని కొనియాడారు. ఆలూరు నియోజకవర్గంలో వేదావతి, నగరడోన రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తిచేసి జింకల పార్కును ఏర్పాటు చేయాలన్నారు. తదితర సమస్యలను గుర్తించి మహాసభలో తీర్మానం చేసి భవిషత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. భూపేష్,సిపిఐ మండల కార్యదర్శిరామాంజనేయులు, సహాయ కార్యదర్శి ఎస్.ఎస్. బాషా, ఏఐటియుసి తాలూకా కార్యదర్శి రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో జీవన జ్యోతి ఆశ్రమంలో విడది పొందిన అనాథలకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిత్యవసర సరుకులు అందించారు. లైన్స్ క్లబ్ డిస్టిక్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ అనాథలకు ప్రతి ఒక్కరు వారి భృతికి సహకరించాలన్నారు. జీవనజ్యోతి అనాథవృద్ధాశ్రమంలో ఉంటున్న వారికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. బియ్యం, కంది బేడలు, వంటనూనె, బెల్లం, తదితర వస్తువులను నిర్వాహకులకు అందించామన్నారు. ఆదోని లయన్స్ క్లబ్ సభ్యులు ప్రతి సేవా కార్యక్రమంలో ముందు ఉంటారని స్పష్టం చేసారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా ఇటువంటి విరాళాలు తరచూ ఇస్తూ సమాజానికి సేవ చేస్తూ ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ప్రసాదరావు.. క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా ...కోశాధికారి వనప రాజు గోవిందరాజమూర్తి, ఓం ప్రకాష్ ...నీల మోహన్ వున్నారు.

హ్యాండ్ రైటింగ్ శిక్షణ నిర్వహిస్తున్న ఉపాధ్యాలు, విద్యార్థులు

విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి. వెల్దుర్తి

మండల పరిధిలోని ఎస్ బోయినపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రాజశేఖరప్ప, గూడూరు బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్‌పై విద్యార్థులకు గురువారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ కోటింగ్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. కార్యక్రమన్ని ప్రధానోపాధ్యాయుడు డి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించారు.